
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,382, క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,54,430 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2,47,213 క్యూసెక్కులు వదులుతున్నారు. 35.4158 టీఎంసీలు నిల్వ ఉంది.

నేడు వేకువజాము 3 గంటల నుంచే దర్శనం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారు జాము మూడు గంటల నుంచే అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఈఓ శీనానాయక్ తెలిపారు.

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవిగా బాలచాముండేశ్వరిదేవి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా గురువారం బాల చాముండేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ ఉత్సవాలలో నాల్గవ రోజు అన్నపూర్ణాదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీ చక్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ అన్నపూర్ణాదేవి అలంకాల విశిష్టతను వివరిస్తూ లోక పోషకురాలైన అన్నపూర్ణాదేవి రూపంలో బాలాచాముండికాదేవిని దర్శిస్తే కాశీని దర్శించినంత పుణ్యం లభిస్తుందన్నారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, కోదండ రామస్వామి దేవస్థానాలలో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయాలలో పూజలు నిర్వహించారు.

అలరించిన గాత్ర కచేరి



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం గాత్ర కచేరి నిర్వహించారు. నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత నృత్య పాఠశాల, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సంయుక్తంగా నిర్వహించగా, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ కల్చరల్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వీజే.వినయకుమార్ అధ్యక్షత వహించారు. టీటీడీ ఆస్థాన గాయకుడు ఎం.రవిచంద్ర పలు గీతాలను ఆలపించారు. కీబోర్డుపై ఎస్.మురళీ, తబలాపై జీఎం. బాబురావు, రిథమ్స్‌పై ఎం.రెడ్డప్ప, శృతి వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ ఎం.ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

రిటర్నబుల్ ప్లాట్లకు నేడు 'ఈ - లాటరీ'

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్డీఏ పరిధిలో భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం (ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామ రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపునకు ఈ - లాటరీ నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటరులోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా కేటాయిస్తామని వెల్లడించారు. వీటిలో 43 రెసిడెన్షియల్, 41 కమర్షియల్, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నట్లు వివరించారు. ఈ- లాటరీ కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



తాడేపల్లి రూరల్: తాడేపల్లి కనకదుర్గ వారధిపై గురువారం రాత్రి భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గుంటూరు - విజయవాడ మార్గంలో భారీగా వాహనాలు రావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రకాశం బ్యారేజ్ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో కనకదుర్గ వారధివైపు వాహనాలు భారీగా చేరుకున్నాయి. వారధి నుంచి కుంచనపల్లి బకింగ్‌హామ్ కెనాల్ వరకు జాతీయ రహదారితో పాటు సర్వీస్ రోడ్‌లో సైతం ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది.



రణభేరి బహిరంగ సభకు హాజరైన మహిళా ఉపాధ్యాయులు



రణభేరి మోగిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలు



రణభేరి బహిరంగ సభకు హాజరైన ఉపాధ్యాయులు

రణభేరి

కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై ఉపాధ్యాయులు రణభేరి మోగించారు. కూటమి ప్రభుత్వ కుయుక్తులను, మోసాన్ని ఎండగట్టారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిర ప్రాంగణంలో రాష్ట్రస్థాయి 'రణభేరి' బహిరంగ సభ నిర్వహించారు. నాలుగు విడతల డీఏలతో పాటు పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వద్ద దాచుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ డబ్బులు అడిగితే అంక్షలు పెడుతున్నారంటూ మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అక్టోబర్‌లో జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

- గుంటూరు ఎడ్యుకేషన్ / సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

పల్నాడుకు వ్యాధుల భయం

జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

పల్నాడు జిల్లాను సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోంది. ఏ ఇంటిలో చూసినా ఒకరిద్దరు బాధితులు కనిపిస్తున్నారు. బాధితులు ఆస్పత్రుల బాట పట్టడంతో ఒక్కసారిగా ఓపీలు పెరిగాయి. గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం, కలుషిత తాగునీరు సరఫరా కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వం కానీ, అధికార యంత్రాంగం కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

- జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిట
- ప్రమాద ఘంటికలు మోగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, యంత్రాంగం
- కాలనీలలో ముందుకు కదలని మురుగు
- పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- తాగునీటిని సరఫరా చేయకపోవడంతో రోడ్డెక్కుతున్న ప్రజలు
- గతేడాది ఇదే సమయంలో డయేరియా వ్యాప్తి



తాగునీటి కోసం అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై రాస్తారోకో చేస్తున్న దుర్గాభవానీ కాలనీవాసులు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏ ఇంటిలో చూసినా ఒకరిద్దరు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. మరీ ముఖ్యంగా జిల్లాలో డెంగీ, అతిసార కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. గ్రామాల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతూ ప్రజల్ని భయపెడుతున్నాయి. జ్వర బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు నిండిపోతున్నాయి. నరసరావుపేట ఏరియా వైద్యశాలలో రోజు ఓపీలు సాధారణంగా 450 ఉంటాయి. వాతావరణ మార్పుల ద్వారా వస్తున్న జ్వరాల వల్ల ఓపీల సంఖ్య సుమారు 100 నుంచి 150 దాకా పెరిగాయి. వచ్చిన ఓపీలలో 40 శాతం టైఫాయిడ్, డెంగీ, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నవారే ఉన్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం 370 ఓపీలు నమోదయ్యాయి, ఇందులో సుమారు 170 దాకా జ్వర పీడితులే ఉన్నారు. ఇలా ప్రతి ఆసుపత్రిలో ఓ వైపు సీజనల్ వ్యాధులతో నిండిపోయి ప్రమాద ఘంటికలు మోగుతుంటే ప్రభుత్వం మాత్రం మిన్నుకుండిపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి, గతంలో ఇంటింటికి వైద్య, సచివాలయ సిబ్బంది వెళ్లి సర్వేలే చేసేవారు. వారికి అవసరమైన మందులు ఇంటి వద్దే అందజేసి, అవసరమైన వారికి నరసరావుపేట ఏరియా వైద్యశాలకు రెఫర్ చేసేవారు. ప్రస్తుతం అవేవి జరగడం లేదు.



పెదకూరపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీలో బారులు తీరిన రోగులు

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్య పనులు

దాచేపల్లి, పిడుగురాళ్ల, గురజాల ప్రాంతాల్లో గతేడాది అతిసారం ప్రబలి ప్రాణాలు వదిలారు. వందలాది మంది ఆసుపత్రుల పాలయ్యారు. నగరపంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది శివారు కాలనీల్లో మురుగు సమస్యను పట్టించుకోకపోవడంతో తాగునీరు కలుషితమై అతిసారం ప్రబలింది. ప్రస్తుతం వర్షాలు అధికంగా నమోదై కాలనీల్లో మురుగు నిల్వ ఉంటోంది. రోడ్లు, ఇళ్ల మధ్య మురుగు కదలడం లేదు. దీంతో దోమల వృద్ధి పెరిగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. గతేడాది చేదు జ్ఞాపకాలు వెంటాడుతున్న అధికార యంత్రాంగంలో చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. పక్కనే ఉన్న గుంటూరులో డయేరియా కేసులు రోజురోజుకు పెరిగి ప్రమాదకరంగా మారుతున్న తరుణంలో జిల్లాలో కూడా అటువంటి పరిస్థితి తలెత్తితే పరిణామాలు తీవ్రంగా ఉండే అవకాశముంది. ఆ పరిస్థితి రాకముందే ఎక్కడికక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాలలో తూతూమంత్రంగా ఫాగింగ్ యంత్రాలతో దోమల మందు పిచికారీ చేయిస్తున్నారు. మరికొన్ని పంచాయతీలలో ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. ఫాగింగ్ యంత్రాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. జిల్లాలో ప్రజలకు తాగునీరు కూడా సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది. తమకు తాగునీరు సరఫరా చేయడంలేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని దాచేపల్లి నగర పంచాయతీ వాసులు అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై ఆందోళనకు దిగారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



దాచేపల్లి పట్టణం దుర్గాభవానీ కాలనీలో ఇళ్ల మధ్య మురుగు నిలిచిన దుస్థితి

బాలకృష్ణ వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనం

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: సినీ నటుడు, సీఎం చంద్రబాబు వియ్యంకుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ పూర్వాపరాలను మరిచిపోయి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆనాడు సినీ నటులు అందరూ కలిసి తెలుగు ఇండస్ట్రీ సమస్యపై వైఎస్ జగన్ ఇంటికి వస్తే వారందరినీ సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేసి గౌరవించారన్నారు. ఇప్పుడు ఆ విషయాన్ని బాలకృష్ణ మధ్యపెట్టి చేసిన బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చూస్తే అతను ఒక ప్రజాప్రతినిధిగా ఉండేందుకు అర్హుడు కాదని పేర్కొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా యరపతినేని అబద్ధాలు

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గురజాల: మెడికల్ కళాశాల విషయంలో అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నీ అబద్ధాలు, తప్పుడు లెక్కలు చెప్పాడని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. గురజాలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాల విషయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సెల్ఫీ చాలెంజ్‌లతోపాటు పలు పోరాటాలు చేశారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ హయాంలో 28 శాతం పనులు మాత్రమే జరిగాయని పచ్చి అబద్ధమాడాడన్నారు. యరపతినేని లెక్కల్లో వీక్ అని ఆరోపించారు. లెక్కలు నేర్చుకొమ్మని ఎన్నిసార్లు చెప్పినా తప్పుడు లెక్కలు వేస్తున్నాడన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో 2020-21లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు భూమికొనుగోలుకు రూ.15 కోట్లు, 2021-22లో రూ.37 కోట్లు, 2022-23లో రూ.87కోట్లు, 2023-24లో రూ.55కోట్లు, 2024-25లో రూ.46కోట్లు, 2025 ఏప్రియల్ వరకు రూ.10 కోట్లు అంటే సుమారుగా రూ.250 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం జూన్ నెల నుంచి రూ.33 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మేము నోటిమాటలతో లెక్కలు చెప్పడం లేదని చెప్తున్నామన్నారు. 60శాతం పనులు వైఎస్సార్ సీపీ హయాంలో పూర్తి చేశామన్నారు. మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదన్నారు. యెనుముల మురళీధర్‌రెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), కె.బుజ్జి, అన్నారావు ఉన్నారు.

ప్రభుత్వానికి ప్రజల బాధలు పట్టవా ?




డయేరియా బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని, నూరిఫాతిమా, బాలవజ్రబాబు తదితరులు

- మాజీ మంత్రి విడదల రజిని
- గుంటూరు జీజీహెచ్‌లో డయేరియా బాధితులకు పరామర్శ

గుంటూరుమెడికల్: నగర ప్రజలు పది రోజులుగా డయేరియాతో అల్లాడిపోతున్నా కూటమి ప్రభుత్వానికి వారి బాధలు పట్టవని వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. డయేరియా బారిన పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం ఆమె పరామర్శించారు. వార్డులో వసతులు లేకపోవడాన్ని గమనించి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పది రోజులుగా డయేరియా తగ్గుముఖం పట్టలేదంటే ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని, ఇది కూటమి ప్రభుత్వం విఫలమేనని పేర్కొన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో డయేరియా వస్తే కేవలం మూడు రోజుల్లోనే కట్టడి చేశామని గుర్తు చేశారు. యంత్రాంగం అంతా గుంటూరుపై దృష్టి సారించి ప్రజల ప్రాణాలు పోకుండా కాపాడామని తెలిపారు. చికిత్స పొందుతున్న వార్డుల్లో వసతులు సైతం అరకొరగా ఉన్నాయని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థకు ప్రత్యేకంగా రూ. 1400 కోట్ల బడ్జెట్ ఉందని, అధికారులు తలుచుకుంటే తాగునీరు అందించవచ్చని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ నిద్ర పోతోందని, అందుకు నిదర్శనం పదిరోజులైనా డయేరియా గుంటూరు నగరంలో అదుపులో లేకపోవడమేనని పేర్కొన్నారు. కలరా కేసులు చాలా అరుదుగా వింటామని, గుంటూరులో 11కు పైగా కేసులు నమోదైనా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డయేరియా, కలరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, పెద్ద విషయంలా కనిపించడం లేదని విమర్శించారు. తురకపాలెంలో 40 మంది కిపైగా చనిపోయారని, దానికి ఇప్పటి వరకు కారణాలు ప్రభుత్వం తెలియజేయలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటైజేషన్‌పై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేదని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వారికి అమ్మేసి, సొమ్ము చేసుకోవడంలో బిజీగా కూటమి ప్రభుత్వం ఉన్నట్లు ఆరోపించారు. మెడికల్ కాలేజీలపై చర్చకు తాము సిద్ధమేనని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు పాల్గొన్నారు.



కారంపూడిలో కాత్యాయని అలంకారంలో అంకాలమ్మ తల్లి



వినుకొండలో వాసవి మాత అలంకారంలో వాసవి కన్యకాపరమేశ్వరి



పిడుగురాళ్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు



నరసరావుపేట రెడ్డినగర్‌లో కాత్యాయని దేవి అలంకారంలో బతుకమ్మ

భక్తుల పాలిట కల్పవల్లి కాత్యాయని దేవి

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్ర్యుత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గురువారం పలు ఆలయాల్లో కాత్యాయని దేవిగా అమ్మవారు దర్శనమించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కాత్యాయని దేవిని చదుర్విధ పురషార్థాలు సిద్ధిస్తాయని, రోగాలు, భయాలు నశిస్తాయని, ఆయురారోగ్యాలు, సుఖఃసంతోషాలు వర్ధిల్లుతాయని భక్తుల నమ్మకం.

- సాక్షి, నెట్‌వర్క్

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్ నమోదుకు 30 తుది గడువు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్ పరీక్ష రాసేందుకు ఈనెల 30వ తేదీ వరకు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష డిసెంబర్ 7వ తేదీన నిర్వహిస్తారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల ప్రాథమికోన్నత, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలని తెలిపారు. వివరాలకు డీఈఓ కార్యాలయంలో పి.శంకరరాజు (9963192487)ను సంప్రదించాలని సూచించారు.

రేపు మాచర్లలో జాబ్ మేళా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్.కే.బి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ.తమ్మాజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గ పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు సుమారు పది కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని వెల్లడించారు. విద్యార్హతను బట్టి సుమారు రూ.15వేల నుంచి రూ.35వేల వరకు జీతం ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీ.టెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ చేసి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటాతోపాటు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు హెచ్‌టీటీపీ//నైపుణ్యం.ఏపీ.జీవోవి.ఇన్.యూజర్ రిజిస్ట్రేషన్ అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఆర్.కిరణ్‌నాయక్ 7842747682, శ్రీకాంత్ 9492158153 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజలకు స్మార్ట్ టెన్షన్

- జిల్లాకు 6,30,347 స్మార్ట్ రేషన్ కార్డులు
- ఇప్పటి వరకు 4,89,094 మందికి కార్డులు పంపిణీ
- 1,41,253 మందికి అందని కార్డులు
- అధికారుల పర్యవేక్షణ లోపం



పాకాలపాడులో కార్డుల పంపిణీకి ఫేస్ రికగ్నైషన్ తీసుకున్న వీఆర్వో(ఫైల్)

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు ఇంకా అందక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ గందరగోళంగా తయారైంది. అస్తవ్యస్త ముద్రణతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. పురుషులను మహిళలను చేసి.. వారికి కార్డులు ఇస్తున్నారు. దీంతో పేద ప్రజలు రేషన్ కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కార్డు ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులు పాట్లు పడుతున్నారు. సెప్టెంబర్ నెల రేషన్ అందజేత పూర్తయినా.. ఇంకా జిల్లాలో 1,43,253 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందలేదు.

జిల్లాకు 6,30,347 స్మార్ట్ కార్డులు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు మొత్తం 6,30,347 స్మార్ట్ రేషన్ కార్డులు రాగా గురువారం నాటికి 4,89,094 మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తయింది. 77.59 శాతం మాత్రమే పూర్తి చేశారు. వాస్తవానికి గత నెల 25 నుంచే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జిల్లాలో ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 1,43,253 మంది స్మార్ట్ రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఈ- కేవైసీ, ఇతర సాంకేతిక సమస్యల కారణంతో కొత విధించి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసింది. చాలా వరకు స్మార్ట్ రేషన్ కార్డుల్లో అక్షరదోషాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పేర్లు తప్పులతడకగా ఉన్నాయి. వయసులో తేడాలు, షాప్ నంబర్లు, చిరునామా, ఆడ, మగ, సచివాలయం పేర్లు సైతం తారుమారయ్యాయి. ఇక మంజూరైన కార్డులను గ్రామ,వార్డు, సచివాలయ ఉద్యోగులు రేషన్ డీలర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కార్డులు పంపిణీ చేసేలా ఆయా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేశారు. తొలుత సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదురవడంతో .. ఆ ప్రభావం మొత్తం పంపిణీపై కనిపిస్తుందని కొందరు సిబ్బంది పేర్కొంటున్నారు.

బిజీగా సచివాలయ సిబ్బంది

స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయాల్లోనే తీసుకోవాలని అధికారులు ముందుగా ప్రకటించడంతో కార్డుదారులు సచివాలయాలకు పరుగులు పెట్టారు. అయితే సచివాలయం సిబ్బంది వివిధ పనుల పేరుతో బిజీబిజీగా ఉంటున్నారు. మరి కొన్ని గ్రామ సచివాలయాల్లో వీఆర్వో, రేషన్ డీలర్ వద్ద కొన్ని స్మార్ట్ రేషన్ కార్డులు.. సచివాలయంలో కార్డులన్నీ ఒకచోట పడేసి లబ్ధిదారులను వెతుక్కోవాలని చెబుతున్నారు. ఒకరు కార్డు మరొకరు తీసుకెళ్లిపోతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇంటికి వెళ్లి చూసుకున్న తర్వాత ఆ కార్డు తమది కాదని మళ్లీ సచివాలయాలకు తీసుకొస్తున్నారు.

కార్డులు పంపిణీ చేస్తున్న అధికార పార్టీ నేతలు



సత్తెనపల్లి 13వ వార్డులో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో టీడీపీ నాయకులు

జిల్లాలో కొందరు ద్వితీయశ్రేణి ఔత్సాహిక అధికార పార్టీ నేతలు ఇంటింటికి తిరుగుతూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకే ఓట్లు వేయాలని ఒప్పందాలు చేసుకొని మరీ కార్డులు పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ మీరు మాకు ఓటు వేయకపోతే ఇట్టే తెలిసిపోతుందని, ఆ తర్వాత అయినా మీ కార్డు రద్దు చేయిస్తామంటూ కొన్నిచోట్ల బెదిరింపులకు దిగుతున్నారు.

లిఫ్ట్ లో ఇరుక్కున్న ప్రయాణికులు



నడికుడి రైల్వేస్టేషన్‌లో నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు



లిఫ్ట్‌లో ఇరుక్కున్న ప్రయాణికులను బయటకు తీస్తున్న సిబ్బంది

- నడికుడి రైల్వే జంక్షన్‌లో ఘటన
- నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు

దాచేపల్లి: నడికుడి రైల్వే జంక్షన్‌లో ఉన్న లిఫ్ట్‌లో ప్రయాణికులు గురువారం ఇరుక్కుపోయారు. నడికుడి రైల్వేస్టేషన్ నుంచి గుంటూరు వెళ్లేందుకు ప్రయాణికులు నడికుడి రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. ఒకటో నెంబర్ ప్లాట్ ఫారం నుంచి రెండో నెంబర్ ప్లాట్ ఫారం పైకి వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ ఎక్కి కిందకు దిగుతుండగా ఆకస్మాత్తుగా లిఫ్ట్ మధ్యలో ఆగిపోయింది. దీంతో లిఫ్ట్‌లో ప్రయాణికులు ఇరుక్కుపోయి తీవ్ర భయాందోళన చెందారు. ఈ విషయం అక్కడ ఉన్న తోటి ప్రయాణికులు గమనించి రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు స్టేషన్‌లోకి వచ్చి ఆగింది. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన ప్రయాణికులు ఈ రైలులోనే వెళ్లాల్సి ఉంది. రైల్వే సిబ్బంది అతి కష్టం మీద లిఫ్ట్ ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీశారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన వీరిని బయటకు తీసేంతవరకు జన్మభూమి ఎక్స్ ప్రెస్ రైలుని స్టేషన్‌లోనే ఆపేశారు. సుమారు పది నిమిషాలపాటు రైలు ఆగింది. తర్వాత లిఫ్ట్‌లో ఇరుక్కున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. జన్మభూమి ఎక్స్ ప్రెస్ రైలు ఎక్కి వెళ్లారు. ఇటీవల కాలంలో నడికుడిలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు తరచూ ఆగిపోవడంతో ప్రయాణికులు ఆందోళన చేస్తున్నారు.

'డీఈఓ పూల్' ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించాలి

గుంటూరుఎడ్యుకేషన్: డీఎస్సీ-2025 నియామకాల కంటే ముందుగానే డీఈఓ పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బసవ లింగారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1236 మంది డీఈఓ పూల్‌లో ఉన్నారని, 2016లో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నిలకడగా ఏ ఒక్క పాఠశాలలో పనిచేయలేక పోయారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 50 మందికి పైగా ఉన్నారని తెలిపారు. వీరికి ఉద్యోగోన్నతి కల్పించకుండా డీఎస్సీ నియామకాలు ద్వారా కేడర్‌లో జూనియర్లుగా మిగిలిపోతారన్నారు. న్యాయపరమైన అంశాలతో వీరికి ఉద్యోగోన్నతులు అడ్డుకోవడం సరికాదన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ అర్హత గల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పీఈటీ ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరిగిందని తెలిపారు. డీఎస్సీ మాదిరిగానే జూనియర్ కాలేజీ, డైట్‌లలో నియామకాలు చేపట్టాలని కోరారు. ప్లస్ 2 పాఠశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు సబ్జెక్ట్ టీచర్స్ కొరతతో ఇబ్బంది పడుతున్నారని, ఖాళీలను అర్హత గల స్కూల్ అసిస్టెంట్స్‌తో భర్తీ చేసి విద్యా ప్రమాణాలు కాపాడలన్నారు. సంఘ నాయకులు మాట్లాడుతూ దసరా పండుగకు పెండింగ్ నాలుగు డీఏలలో ఒక్కటైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా నాయకులు పి.లక్ష్మినారాయణ, జి.దాస్, మునినాయక్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

- నాలుగేళ్లుగా యువతికి ప్రేమ కబుర్లు
- మాయమాటలు నమ్మి శారీరకంగా దగ్గరైన యువతి
- యువకుడు వేరే పెళ్లికి సిద్ధమవడంతో పోలీసు స్టేషన్ మెట్లెక్కిన బాధితురాలు
- కేసు నమోదు చేసిన నరసరావుపేట పోలీసులు

నరసరావుపేట టౌన్: నేనున్నానంటూ చెప్పిన మాయ మాటలను నిజమేనని నమ్మింది. నువ్వే సర్వస్వం అంటూ చూపిన ప్రేమకు దగ్గరైంది. పెళ్లి చేసుకుంటానని చెప్పిన ప్రమాణానికి తన సర్వసం అర్పించింది. చివరకు సదరు ప్రబుద్ధుడు వేరే పెళ్లికి సిద్ధమవుతున్నాడని తెలిసి న్యాయం చేయండి అంటూ పోలీస్‌స్టేషన్ గడప తొక్కింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నరసరావుపేట పోలీసులు బుధవారం వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా సింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన యువతి, ప్రకాశం జిల్లా దొనకొండలో నాలుగేళ్ల కిందట డిగ్రీ చదివింది. ఆ సమయంలో దొనకొండకు చెందిన యండ్లూరి చినరాజుతో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. ఆరు నెలలుగా చినరాజు పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఓ ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూంలో పనిచేస్తూ పల్నాడు బస్టాండ్ సమీపంలో ఓ రూం అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. అక్కడికి యువతిని అనేక సార్లు పిలిచి పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరకంగా లోబరుచుకున్నాడు. పెళ్లి చేసుకోమని యువతి కోరటంతో కాలయాపన చేస్తూ వస్తున్నాడు. అతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఈనెల 16వ తేదీన యువతి చినరాజు స్వగ్రామమైన దొనకొండకు వెళ్లి విచారించగా మరో యువతితో పెళ్లికి సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి దొనకొండ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన దొనకొండ పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతం నరసరావుపేట పరిధి కావటంతో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేసినట్లు సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు.

రసవత్తరంగా జాతీయ చెస్ చాంపియన్ షిప్



విజ్ఞాన్ యూనివర్సిటీలో చెస్ పోటీల్లో తలపడుతున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ బుధవారం నాలుగోరౌండ్ ముగిసే సరికి ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు, నలుగురు ఇంటర్నేషనల్ మాస్టర్లు చెరో నాలుగు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. టాప్ బోర్డులపై జీఎంలు, ఐఎంల మధ్య ఉత్కంఠభరితంగా పోటీలు జరిగాయి.

- మాజీ ఆసియా చాంపియన్, రెండో సీడ్ జీఎం సూర్యశేఖర్ గంగూలీ అలాగే భారత 2700 రేటింగ్ దాటిన రెండో ఆటగాడు జీఎం కృష్ణన్ శశికిరణ్‌లు ప్రతిభ చూపించారు.
- తమిళనాడు ఆటగాడు ఐఎం మనీష్ ఆంటో క్రిస్టియానోపై పీఎస్‌పీబీ ఆటగాడు గంగూలీ ఎక్స్చేంజ్ సాక్రిఫైస్ తర్వాత రూక్ త్యాగంతో ఆధిపత్యం సాధించాడు.
- ఆంధ్ర ఆటగాడు జీఎం ఎం.ఆర్. లలిత్ బాబు ఫ్రెంచ్ డిఫెన్స్‌లో స్థిరమైన ఆట ఆడి, అలేఖ్య ముఖర్జీపై విజయం సాధించాడు.
- మూడో సీడ్ జీఎం ఎస్.పి.సేతురామన్, హరియాణా ఆటగాడు ఐఎం ఆదిత్య దింగ్రా తప్పిదం వల్ల ఓటమి నుంచి తప్పించుకున్నాడు. గేమ్ డ్రాగా ముగిసింది.
- కేరళ ఐఎం హెచ్.గౌతమ్ కృష్ణ, గుజరాత్ ఆటగాడు ఘూదవి వీరభద్రసింగ్‌పై అద్భుతంగా ఆడాడు. రూక్ త్యాగం చేసి బ్యాక్ ర్యాంక్ చెక్‌మేట్‌తో విజయం సాధించాడు.
- ఇప్పటివరకు టోర్నమెంట్‌లో పొడవైన గేమ్ ఆంధ్ర ఆటగాడు ఐఎం ఎస్. రవితేజ (రైల్వేలు), గుజరాత్ ఆటగాడు జిహాన్ తేజస్ షా మధ్య సాగింది. రవితేజ 140 మూవ్‌ల తర్వాత బిషప్, నైట్ కాంబినేషన్‌తో చెక్‌మేట్ చేశాడు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా క్రీడా పోటీలు



గౌరవ వందనం సమర్పిస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

నకరికల్లు: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు పల్నాడు జిల్లా నకరికల్లు వేదికైంది. 12వ రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్ క్రీడా పోటీలు నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 540 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ క్రీడాపోటీలు ప్రారంభించారు. క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. తొలిమ్యాచ్‌ను పల్నాడు-విజయనగరం జిల్లాల మధ్య నిర్వహించారు. రెండురోజులపాటు నిర్వహిస్తున్న పోటీలు తొలిరోజు మధ్యాహ్నం నుంచి రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కూడా సాగాయి. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రాయితీలు లభిస్తాయన్నారు. క్రీడా మైదానాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్రీడాకారులందరూ సానుకూల దృక్పథంతో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆట్యా-పాట్యా అసోసియేషన్ సీఈఓ ఆర్.డి.ప్రసాద్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.శ్రీచరణ్, సామ్రాజ్యం, వి.రోహిత్ జోయెల్, ఫ్లోర్‌బాల్ ఏపీ అసోసియషన్ కార్యదర్శి జోసఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్‌లు ఝాన్సీరాణి, చింతా పుల్లయ్య, చినబాబు, వెంకటేశ్వర్లు, అంజనేయులు, మణి, మద్దం వెంకటేశ్వర్లు, నాయకులు నాగోతు శౌరయ్య, పీఎంసి చైర్మన్ కాసా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జున్ను మాస్టర్‌కు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు

- చేతిరాతలో ఉచిత శిక్షణ అందిస్తున్నందుకు గుర్తింపు
- ఒకే నెలలో జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు మూడు అవార్డులు



నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ జున్ను సాహెబ్

యడ్లపాడు: విద్యార్థులకు చేతిరాతలో ఉచిత శిక్షణ ఇస్తూ తనదైన శైలిలో గుర్తింపు పొందిన కొండవీడు జెడ్పీ హైస్కూల్ ఎస్జీటీ ఉపాధ్యాయుడు డాక్టర్ షేక్ జున్నుసాహెబ్‌కు మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో బిర్లా ప్లానెటోరియం వద్ద ఉన్న భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు-2025ను ప్రదానం చేశారు.

ఒకే నెలలో మూడు అవార్డులు

విద్యారంగానికి జున్ను సాహెబ్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ నెలలో ఇది మూడో అవార్డు రావడం విశేషం. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఏపీ రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈనెల 7న విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్‌థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నుంచి గురుబ్రహ్మ రాష్ట్రస్థాయి అవార్డు, తాజాగా జాతీయస్థాయి అవార్డు తెలంగాణ రాష్ట్రంలో అందుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతులు భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి

నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయంలో ప్రతి ఒక్క రైతు భాగస్వామి కావాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. బృందావనంలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. అమలకమారి మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఉద్యమంలా ముందుకు వెళ్తుందని తెలిపారు. 2025-26 సంవత్సరంలో జిల్లాలో 82,619 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. రైతులు రసాయనాలు విడిచి కషాయాలు వాడటం వలన భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పంట ఉత్పత్తులు ఆరోగ్యకరంగా ఉండటంతోపాటు రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలతోపాటు అంతర పంటలు వేసి, చుట్టూ జొన్న-సజ్జ పంటలు నాటితే పంటకు రక్షణతోపా టు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. రసాయనాలు, ఎరువులు, పురుగుమందులు లేకుండా ఆవు మూత్రం -పేడ ఆధారంగా తయారైన సహజ కషాయాలను వాడితే పంట ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు మాట్లాడు తూ గ్రామ సమైఖ్య సంఘం పరిధిలో ప్రకృతి వ్యవసా య వనరుల కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.లక్ష నగదు అందజేస్తుందని తెలిపారు. ఎన్‌ఎఫ్‌ఏలు నందకుమార్, సౌజన్య, అప్పలరాజు, మేరి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో 21 వాటర్ ప్లాంట్లు సీజ్

నెహ్రూనగర్(గుంటూరు): నగరంలో కలుషిత తాగునీటిని సరఫరా చేస్తూ ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్న 21 మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రజారోగ్యం దృష్ట్యా వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు సీజ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరంలో కొన్ని ప్రాంతాలలో కలుషిత తాగునీటి వలన డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో ఉన్న 120 మినరల్ వాటర్ ప్లాంట్లు సరఫరా చేసే తాగునీటి శాంపిల్స్‌ను మంగళగిరిలోని ఐపీఎం పీహెచ్ ల్యాబ్, గుంటూరు మెడికల్ కాలేజీ ఆవరణలోని రీజినల్ పీహెచ్ ల్యాబరేటరీలో పరీక్షించగా అందులో 21 ప్లాంట్ల నుంచి విక్రయించే నీటిలో హానికారక బ్యాక్టీరియాను గుర్తించడం జరిగిందన్నారు. బ్యాక్టీరియాలను కలిగియున్న నీటిని విక్రయిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లను వెంటనే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిందన్నారు.